
వరదను ఎదుర్కొనేందుకు సర్వం సిద్ధం

- ఏటిగట్లపై నిరంతరం పహారా
- చీఫ్‌విప్ ప్రసాదరాజు సూచనలతో భద్రతా చర్యలు

నరసాపురం రూరల్: నరసాపురంలో వరద మట్టం గంట గంటకూ పెరుగుతోంది. భద్రాచలం, దవళేశ్వరం, నీటి మట్టాలకు అనుగుణంగా 12 గంటల వ్యత్యాసంతో వరద పోటు కనిపిస్తోంది. వశిష్ట గోదావరి కుడిగట్టు 45 కిలో మీటర్ల మేర బలహీనంగా ఉన్న పరిస్థితులపై చీఫ్‌విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు ఏటిగట్ల పరిరక్షణ శాఖ, రెవిన్యూ, పోలీస్ శాఖలను అడిగి ఎప్పటి కప్పుడు పరిస్థితులను తెలుసుకుంటున్నారు. దశాబ్ద కాలానికి పైబడి ఏటిగట్ల సంరక్షణ గురించి, వరద పరిస్థితులపైన సంపూర్ణమైన అవగాహన ఉన్న చీఫ్ విప్ రక్షణ చర్యలపై కట్టుదిట్టమైన సూచనలు చేస్తున్నారు. సర్వే బాదులు, ఖాళీ సంచులు, ఇసుక నిల్వలు, అవసరమైన ప్రతీచోటా పెట్టించి భయం అనేది లేకుండా భరోసా ఇస్తున్నారు. నరసాపురం పట్టణంలో గోదావరి మురుకు నీరు డ్రెయిన్ల అవుట్‌లెట్లను సరి చేయించి పట్టణంలోకి నీరు రాకుండా ఏటిగట్ల సంరక్షణ శాఖ అధికారి సుబ్బారావు చర్యలు తీసుకున్నారు. కోడేరు 45వ మైలురాయి మొదలు పొన్నపల్లి వరకూ ఏటిగట్టుకు ఎలాంటి డోకా లేదని ఏఈ చెబుతున్నారు. నరసాపురం పట్టణం నుంచి బియ్యపుతిప్ప వరకూ గట్టు పటిష్ఠంగా ఉన్నప్పటికీ రాజుల్లంక, ధర్బరేవు ప్రాంతాల్లో గోదావరి నీటి మట్టం లంక మునిగి ఏటిగట్టుని చేరి ప్రవహించే పరిస్థితి చూసే వారికి ఆందోళనగా అనిపిస్తుంది. వేముల దీవి రోడ్డు, ఏటిగట్టు లక్ష్మణేశ్వరం చివారు మొదలు ధాజుల్లంక వరకూ ఒకటిగానే కనిపిస్తుంది. ఇక్కడి గట్టుకు ఎలాంటి ప్రమాదం జరగకుండా గోదావరిలో గ్రోయిన్స్ నిర్మాణం జరిగే ఉన్నాయి. అయినప్పటికీ ఇక్కడ అవసరమైన భద్రతా చర్యలు చేపట్టారు. ధర్బరేవు అవుట్‌ఫాల్స్ గేట్ల దిగువున లీకేజీలను పరిశీలించి వాటిని అరికట్టేందుకు ఇసుక బస్తాలు దింపి సర్వే బాదులతో అదుపు చేశారు. నిరంతరం సంబంధిత సిబ్బంది ఆయా ప్రాంతాల వద్ద అప్రమత్తంగా ఉంటున్నారు. ముఖ్యంగా గోదావరిని చూసేందుకు వచ్చిన ప్రజలను గోదావరికి దగ్గరగా వెళ్లకుండా అడ్డుకుంటున్నారు.


లక్ష్మణేశ్వరంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వశిష్ట గోదావరి


నరసాపురం వలంధర్ రేవులో పెరిగిన వరద


ధర్బరేవులో అవుట్‌ఫాల్ స్లూయిజ్ గేట్లకు అడ్డుకట్ట వేస్తున్న దృశ్యం


గోదావరి వరద ఉధృతిని పరిశీలిస్తున్న తహసీల్దార్

క్లుప్తంగా

నాగరత్నానికి ముదునూరి పరామర్శ


నాగరత్నాన్ని పరామర్శిస్తున్న చీఫ్‌విప్ ప్రసాదరాజు

నరసాపురం: పార్టీ సీనియర్ నాయకురాలు, పట్టణ మహిళా మాజీ అధ్యక్షురాలు గంధం నాగరత్నాన్ని ప్రభుత్వచీఫ్‌విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు సోమవారం పరామర్శించారు. గత కొద్దికాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న ముదునూరి ఆమె యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నాగరత్నం కుటుంబ సభ్యులతో మాట్లాడి అవసరమైన వైద్య సహకారం అందిస్తామని ధైర్యం చెప్పారు. ముదునూరి వెంట పతివాడ మార్కండేయులు, జయ పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం ఉండాలి


యలమంచిలిలో విద్యార్థినులను సన్మానిస్తున్న శెట్టిబలిజ సంఘ పెద్దలు

యలమంచిలి: ప్రతిభ ఉన్న విద్యార్థులను ప్రోత్సాహిస్తే వారు మరింతగా రాణిస్తారని ఎన్ఆర్ఐ కుడుపూడి సత్య అన్నారు. యలమంచిలి పంచాయతీ గొల్లేపరచెరువుగట్టు ప్రాంతానికి చెందిన గుబ్బల పల్లవి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పరీక్షల్లో 470 మార్కులకుగాను 463 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు సాధించింది. అదే విధంగా పెదపాలెం ప్రాంతానికి చెందిన బొక్కా మోహన పద్మశ్రీ యూటీఎఫ్ నిర్వహించిన ప్రతిభ పోటీ పరీక్షల్లో రెండవ స్థానం సాధించింది. ఈ ఇద్దరు విద్యార్థులను సోమవారం శెట్టిబలిజ సంఘ పెద్దల ఆధ్వర్యంలో సత్య సన్మానించి నగదు ప్రోత్సాహకం అందజేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు గుబ్బల రామారావు, కాయితి కోదండవర్మ, కొప్పిశెట్టి శ్రీరామమూర్తి, బొక్కా సురేష్, కడిమి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పెనుమంట్ర ఏఈగా సూర్యనారాయణ


శ్రీరంగనాథరాజుతో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

పెనుగొండ/పెనుమంట్ర: పెనుమంట్ర మండల నూతన ఆర్ డబ్ల్యూఎస్ ఏఈగా బాధ్యతలు స్వీకరించిన పి సూర్యనారాయణ రాజు మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజును మర్యాద పూర్వకంగా కలిశారు. సోమవారం తూర్పుపాలెంలో కార్యాలయంలో కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో పెనుమంట్ర ఎంపీపీ కేవీఎస్ నారాయణ రెడ్డి(వాసు) పాల్గొన్నారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

కాళ్ల: కట్టుకున్న భార్యను వేధిస్తున్నారంటూ బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కాళ్ళ పోలీసులు కేసు నమోదు చేశారు. కాళ్ల గ్రామశివారు గాంధీనగర్‌కు చెందిన మహిళకు 2019 లో రేవు నాగేంద్రబాబుతో వివాహం అయ్యింది. కొంత కాలం బాగానే చూసుకున్న తన భర్త ఈ మధ్య కాలంలో వేధిస్తున్నాడని దీనికి అత్త సహకరిస్తున్నారని బాధితురాలు కోర్టును ఆశ్రయించింది. కోర్టు నుంచి వచ్చిన ఆదేశాల మేరకు కాళ్ల ఎస్సై ఏజీఎస్ మూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా కాటన్ వర్ధంతి

సాక్షి, భీమవరం: గోదావరి జలాలను సక్రమైన మార్గంలో పెట్టడానికి అనకట్టలను నిర్మించి ఉభయ గోదావరి జిల్లాలకు దేవుడిగా నిలిచిన సర్ ఆర్థర్ కాటన్ రుణం తీర్చుకోలేమని ఇరిగేషన్ ఏఈ వినయ్ కుమార్ అన్నారు. సర్ ఆర్థర్ కాటన్ వర్ధంతి కార్యక్రమాన్ని శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో రెస్ట్ హౌస్ రోడ్డులోని ఇరిగేషన్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ రైతు కార్యాచరణ సమితి నాయకుడు పాతపాటి మురళీరంగరాజు సహకారంతో పాఠశాలు, కళాశాలలు, ఇరిగేషన్ కార్యాలయానికి కాటన్ చిత్రపటాలను బహూకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ నందమూరి రాజేష్, కేజీఆర్ఎల్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ కె సత్యనారాయణ, సీతారామరాజు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లు కళాకారులకు సత్కారం

పాలకొల్లు అర్బన్: పాలకొల్లుకి చెందిన పలువురు కళాకారులకు హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో కోడి రామకృష్ణ జయంతి సందర్భంగా ఆయన పేరున ప్రతిభా పురస్కారాలు అందజేశారు. వాసవీ ఫిల్మ్ అవార్డులతో పాటు యలమంచిలి మండలం కొంతేరు గ్రామానికి చెందిన రచయిత, దర్శకుడు, నటుడు, నృత్య, సంగీత దర్శకుడు ఆకుమర్తి బాబూరావుకి కోడి రామకృష్ణ ప్రతిభా అవార్డును సినీ హీరో సుమన్, సినీ నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ, సినీ దర్శకుడు రేలంగి నరసింహరావు, సినీ నటుడు బాబూ మోహన్, సినీ నిర్మాత కోడి పద్మ చేతుల మీదుగా అందజేసినట్లు నటీనట సంక్షేమ సమాఖ్య ప్రధాన కార్యదర్శి తాళాబత్తుల వెంకటేశ్వరరావు సోమవారం విలేకరులకు తెలిపారు. అలాగే లలిత కళాంజని నాటిక పోటీలను 33 సంవత్సరాలు ఏకధాటిగా నిర్వహణకు కృషి చేసిన యియ్యపు రామలింగేశ్వరరావుకి కోడి రామకృష్ణ సేవా పురస్కారాన్ని, అలాగే సినీ దర్శకుడు శివాల ప్రభాకర్, కెమెరామెన్ కొప్పినీడి ప్రశాంత్‌లకు కోడి రామకృష్ణ ప్రతిభా అవార్డులతో సత్కరించినట్లు తెలిపారు.


బాబూరావుని సత్కరిస్తునన సినీ హీరో సుమన్

రవిని పరామర్శించిన నాయకులు

యలమంచిలి: ఏనుగువానిలంక మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు వినుకొండ రవి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. భీమవరంలో చికిత్స పొంది, అనంతరం విశ్రాంతి కోసం హైదరాబాద్ వెళ్లారు. ఆరోగ్య పరిస్థితి మెరుగవ్వడంతో సోమవారం స్వగ్రామం ఏనుగువానిలంక వచ్చారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్, ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు, చింతలపూడి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకుడు గుణ్ణం నాగబాబు పార్టీ నాయకులతో కలసి రవి ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. పూర్తి స్థాయిలో కోలుకుని పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని కోరారు. వారి వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాత్తూరి బుచ్చిరాజు నాయకులు, సర్పంచ్‌లు రావూరి వెంకట కోటి మురళీకృష్ణ, ఉచ్చుల స్టాలిన్, వల్లభు సాయి వెంకట నరసింహారావు, చిలుకూరి సుబ్బారావు చౌదరి, బోనం బులివెంకన్న, గుర్రాల వెంకట్రావు, కవురు గోపి, పాలంకి శ్రీనివాసరావు, వీరా ఉమాశంకర్, మల్లుల కొండ, ఉల్లంపర్తి జాన్, జవదాల సుర్ణరాజు, కుక్కల బాలచంద్రన్ తదితరులు ఉన్నారు.


వినుకొండ రవిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి

నవ్వుతూ తలుపు తట్టి పింఛన్ ఇస్తుంది


అందే తిరుపతమ్మ, భగ్గేశ్వరం

ప్రతీ నెలా 1వ తారీఖు వచ్చిందంటే ఉదయం 6గంటల లోపే మా ఇంటి తలుపు తట్టి నవ్వుతూ పలకరించి పింఛన్ చేతిలో పెడుతుంది. అప్పటికి నా భర్త చిరంజీవి చంద్ర వర్మ నిద్ర మంచం లేవరు. వలంటీర్ సునీత వచ్చిందని నేనే ఆయన్ని మంచం మీద నుంచి నిద్ర లేపుతాను. మా వలంటీర్ సునీత ఆప్యాయంగా పలుకరిస్తుంది. ఆ పలకరింపే మాకు ఎంతో ఆనందం కలుగుతుంది. నాకు వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ సంక్షేమ పథకాలు నాకు అందుతున్నాయి.

అందే తిరుపతమ్మ, భగ్గేశ్వరం

బాధితులకు అండగా సేవలు


నెగ్గిపూడిలో బాధితులను ఆసుపత్రికి పంపుతున్న వలంటీరు భారతి

కరోనాతో అయినవారే దూరం భయభ్రాంతులకు గురైన సమయంలోనూ వలంటీర్లు ప్రాణాలకు తెగించి సేవలు అందించారు. కోవిడ్ సోకడంతో ఇబ్బందులు పడిన మాకు మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఏర్పాటు చేసిన ఉచిత అంబులెన్స్‌పై గ్రామానికి చెందిన వలంటీరు బి.భారతి అండగా నిలిచి వైద్య సిబ్బందితో కలసి భీమవరం ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడింది.

– సీహెచ్ సూర్యవతి, కనకయ్య

చందపర్రులో ఫ్యామిలీ ఫిజీషియన్

పాలకొల్లు అర్బన్: ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రత్యేక వైద్య సేవలను రోగులను సద్వినియోగం చేసుకోవాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎల్.లీనా సుప్రియ కోరారు. మండలంలోని చందపర్రు గ్రామ సచివాలయ ఆవరణలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి రోగులకు సేవలందించారు. దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న రోగుల ఇంటికి డాక్టర్ లీనా సుప్రియ, ఆరోగ్య సిబ్బంది వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఆరోగ్య విస్తరణాధికారి కె ప్రభాకర్, ఎంఎల్‌హెచ్‌పీ బి రాజశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

వాతావరణ మార్పులతో రొయ్య రైతు విలవిల

నరసాపురం రూరల్: ప్రస్తుత వాతావరణం రొయ్యల రైతులను తీవ్రంగా దెబ్బతీసింది. వారం రోజులుగా వాతావరణం చల్లబడటంతో రొయ్యల చెరువుల్లో ఆక్సిజన్ శాతం తగ్గిపోవడంతో రొయ్యలు చనిపోతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. దీంతో రొయ్య రైతుల కష్టాలు వర్ణణాతీతంగా ఉన్నాయి. పగలు రాత్రి తేడా లేకుండా చెరువుల చెంతనే కంటి మీద కునుకు లేకుండా కాపలా కాస్తున్నారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన ఏరియేటర్లకు అదనంగా కొత్తవి కూడా ఏర్పాటు చేసి చెరువుల్లో ఆక్సిజన్ శాతాన్ని పెంచేందుకు తంటాలు పడుతున్నారు. అయినప్పటికీ కొన్నిచోట్ల ఫలితం లేకపోవడంతో సోమవారం ధర్బరేవు, రాజుల్లంక ప్రాంతాల్లో పట్టుబడికి సిద్ధమైన రొయ్యలను అయినకాడికి అమ్ముకున్నారు.


దర్బరేవులో రొయ్యల చెరువులో ఏరియేటర్లు తిరుగుతున్న దృశ్యం

వానలోనూ తగ్గని ఉపాధి

నరసాపురం రూరల్: మండలంలో సోమవారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు వర్షంలో సైతం చురుగ్గా జరిగాయి. 20 గ్రామాల్లో 500 పని దినాలు జరిగాయని ఎంపీడీఓ ఎన్వీ శివప్రసాద్‌యదవ్ తెలిపారు. మండలంలో పంట బోదెలు, పూడికతీతలు తదితర పనులు చురుగ్గా సాగాయి. రైతులు సార్వా పంట సాగుకు సంబంధించి వరినాట్లు వేసేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ఈ పూడికతీత పనులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పలువురు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


దర్బరేవులో మురుగుకాల్వలో పూడిక తీస్తున్న ఉపాధి హామీ కూలీలు

స్పందనకు 41 ఫిర్యాదులు

నరసాపురం రూరల్: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయ వీడియోకాన్ఫరెన్స్ హాల్లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల ప్రజల నుండీ 41 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ ఎం సూర్యతేజ ఆర్జీలను చదివి పరిశీలించి ఫిర్యాదుదారులకు భరోసా ఇచ్చారు. పట్టణానికి చెందిన తోట సురేష్‌కుమార్ డ్రెయినేజి, వీధకుక్కల బెడదను నిర్మూలించాల కోరారు. మొగల్తూరుకు చెందిన జీవివి నాగరాజు తాగునీటి సమస్య, డ్రెయినేజి సమస్యను పరిష్కరించాలని కోరారు. మొగల్తూరుకు చెందిన మోకా నాగరాజు తన ఇంటి సమీపంలో ఉన్న డంపింగ్ యార్డును తరలించాలని కోరారు. దిగమర్రుకు చెందిన వినుకొండ సాయినాగ భాస్కర్ గ్రామంలోని ఐస్ ఫ్యాక్టరీ నుంచి వ్యర్థాలను పంటకాలువలోకి విడిచిపెడుతున్నారన్నారని దీన్ని నియంత్రించాలని కోరారు.


సబ్‌కలెక్టర్ ఎం సూర్యతేజకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం.

నేడు జగనన్న సురక్ష సభలు ఇలా

మొగల్తూరు: నరసాపురం, మొగల్తూరు మండలాల్లో మంగళవారం నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమాల్లో చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు పాల్గొననున్నారు. చీఫ్‌విప్ కార్యాలయం నుండి అందిన సమాచారం మేరకు మొగల్తూరు మండలంలోని జగన్నాథపురం గ్రామంలో ఉదయం 9గంలకు, కేపీ పాలెం నార్త్ గ్రామంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే కార్యక్రమంలోను, మధ్యాహ్నం 2గంటలకు నరసాపురం పట్టణంలోని 20,21 వార్డులకు సంబంధించి పీచుపాలెం సచివాలయం వద్ద నిర్వహించే కార్యక్రమంలోనూ, మధ్యాహ్నం 3గంటలకు లక్ష్మణేశ్వరం1, 4 గంటలకు లక్ష్మణేశ్వరం-2 సచివాలయాల వద్ద నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమాలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొంటారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: మండలంలో కొయ్యేటిపాడు, సత్యవరం గ్రామాలలో మంగవారం జగనన్న సురక్ష గ్రామ సభలు జరుగుతాయని ఎంపీడీఓ వి.పూర్ణబాబ్జి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 10 గంటలక కొయ్యేటిపాడు, 11 గంటలకు సత్యవరం గ్రామాలలో జరిగే సురక్ష గ్రామ సభలకు ఆచంట ఎమ్మెల్యేచెరుకువాడ శ్రీరంగనాథరాజు హాజరుఅవుతారని చెప్పారు.

వెలివెలలో

పాలకొల్లు అర్బన్: మండలంలోని వెలివెల గ్రామ సచివాలయ ఆవరణలో మంగళవారం ఉదయం 11.30 గంటలకు జగనన్న సురక్ష గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సంగాని వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు వివిధ ధ్రువ ప్రతాలను అందిస్తారని వివరించారు.

పేదలకు సంక్షేమ పథకాలతో లబ్ధి


అడవిపాలెంలో ధ్రువపత్రాలు అందిస్తున్న నాయకులు

యలమంచిలి: ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో పేదలకు లబ్ధి చేకూరుతుందని ఎంపీపీ రావూరి వెంకటరమణ అన్నారు. మండలంలోని అడవిపాలెంలో సోమవారం జగనన్న సురక్ష సభ నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఎంపీపీ రావూరి వెంకట రమణతో పాటు మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ ధ్రువీకరణ పత్రాలు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మాతా సునీల్‌కుమార్, సచివాలయ మండల కన్వీనర్ ఓదూరి భాస్కరరావు పార్టీ నాయకులు రావూరి వెంకట కోటి మురళీకృష్ణ, తోట రామకృష్ణ, బుంగా జయరాజు, సిర్రా నాగరాజు, విస్సా అప్పారావు, గంజి నరసింహారావు, విస్సా సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర వైఫల్యంతోనే మారణహోమం

పెనుగొండ: మణిపూర్‌లో అక్కడి రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాల వైపల్యంతోనే 80 రోజులుగా మారణహోమాలతో అట్టుడుకుతుందని అంగన్ వాడీ జిల్లా ఉపాధ్యక్షురాలు వైట్ల ఉషారాణి, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీఎన్ శర్మలు దుయ్యబట్టారు. సోమవారం ఆచంటలో సీఐటీయూ, డీవైఎఫ్ఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆచంట సంతమార్కెట్ నుంచి కచేరీ వరకూ భారీ వర్షంలో ర్యాలీ నిర్వహించి, కచేరీ సెంటర్ మానవహారం నిర్వహించిన నిరసన వ్యక్తం చేశారు. అల్లర్లు జరుగుతుంటే కేంద్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు వద్దిపర్తి అంజిబాబు, చేతివృత్తి దారుల సంఘ సీనియర్ నాయకుడు తోటపల్లి సత్యనారాయణ, సిర్రా నరిసింహమూర్తి, కుసుమే జయరాజు తదితరులు పాల్గొన్నారు.

మొగల్తూరులో 24 మిల్లీమీటర్ల వర్షపాతం

మొగల్తూరు: మండలంలో గత రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు సుమారు 24.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రోజుంతా వర్షం పడటంతో మొగల్తూరులోని ప్రధాన వ్యాపార కూడలైన గాంధీబొమ్మల సెంటర్ బోసిపోయింది. గాంధీ బొమ్మల సెంటర్, స్టేషన్ రోడ్, గొల్లగూడెం, మసీద్ సెంటర్, కాళీపటం తూర్పు, పడమరలోని ప్రధాన రహదారులు, పేరుపాలెం సెంటర్, కేపీ పాలెం ఉన్నత పాలెం సెంటర్‌లలో వర్షపునీరు నిలిచిపోవడంతో స్థానికులతో పాటు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అయితే మరో నాలుగు రోజులు పాటు వర్షాలు కురిస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికతో రైతులు తమ చేలల్లో పూర్తి స్థాయిలో నీరు నిలిచే అవకాశం ఉండడంతో సార్వా సాగు పనులు ముమ్మరంగా ప్రారంభిస్తున్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

నరసాపురం రూరల్ : నరసాపురం పట్టణంలో ఉపాధి కోసం ఉత్తరప్రదేశ్ నుంచి వలస వచ్చిన ఓ యువకుడు అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్టు పట్టణ ఎస్సై బీఎస్‌డీఆర్ ప్రసాద్ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పాతబజార్ సాయిబాబా గుడి సమీపంలో ఓ ఎలక్ట్రికల్ షాపు పైపోర్షన్‌లో అద్దెకు ఉంటున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన శివం (20) అనే వ్యక్తి టైల్స్ పని చేస్తుంటాడు. అతనితో పాటు వారి ప్రాంతానికే చెందిన మరో ఇద్దరు కూడా ఉంటున్నారు. సోమవారం ఉదయం యథావిధిగా పని నిమిత్తం బయటికి వెళ్లిన శివం సాయంత్రం తిరిగి వచ్చాడు. అయితే.. అతనితో పాటు అద్దెకు ఉంటున్న మిగిలిన ఇద్దరూ వచ్చేసరికి ఉరివేసుకుని మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుని తల్లి చనిపోయిందని, తండ్రి ఉత్తరప్రదేశ్‌లో ఉండటంతో వారి దగ్గర బంధువు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

గంగరాజు కుటుంబానికి పరామర్శ

పెనుగొండ: ఆర్యవైశ్య ప్రముఖుడు, రైస్ మిల్లర్ నాగళ్ల గంగరాజు కుటుంబాన్ని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు పరామర్శించారు. నాగళ్ల గంగరాజు ఇటీవల మృతి చెందడంతో పెనుగొండలోని గంగరాజు నివాసంలో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మేడపాటి సాయి చంద్రమౌళీశ్వర రెడ్డి, కోట్ల శంకర్, పలువురు రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

జిల్లా జడ్జి పురుషోత్తంను కలిసిన బార్ అసోసియేషన్ నాయకులు

నరసాపురం రూరల్! నరసాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చల్లా దానయ్య నాయుడు, కార్యదర్శి ఆర్జీ బాబ్జి సోమవారం పశ్చిమగోదావరిజిల్లా జడ్జి పి.పురుషోత్తం ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నరసాపురం బార్ అసోసియేషన్ ఎన్నికలు జరిగిన తర్వాత ఆయనను కలవడం ఇదే ప్రథమం . నరసాపురం బార్ అసోసియేషన్‌లోఉన్న సమస్యలను ఈ సందర్భంగాగా ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. నరసాపురం బార్ అసోసియేషన్‌కు గతంలో అనుమతి ఇచ్చిన కోర్టు ఆవరణలో క్యాంటీన్, జిరాక్స్ ప్రారంభించేందుకు అనుమతి కోరామని వారు తెలిపారు. జడ్జిని కలిసిన వారిలో చొప్పల అశోక్ ఉన్నారు.


జిల్లా జడ్జిని పురుషోత్తంకు పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న దృశ్యం

విద్యతోనే సమాజాభివృద్ధి

వీరవాసరం: విద్య ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందని ఆర్డీఓ దాసిరాజు తెలిపారు వీరవాసరం శివారు యానాదులు కాలనీలో ఉన్న ప్రాంతాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. బడి బయట తిరుగుతున్న పిల్లలు ఎక్కువగా ఈ ప్రాంతంలో ఉన్నారని సమాచారం మేరకు ఇక్కడకు వచ్చామని పిల్లలను పాఠశాలలకు పంపాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.